

రేపు శాసనసభ అంచనాల కమిటీ జిల్లాకు రాక

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): శాసనసభ అంచనాల కమిటీ గురువారం జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'శాసనసభ అంచనాల కమిటీ సభ్యులు గురువారం మధ్యాహ్నం 3గంటలకు శ్రీకూర్మనాథుడిని దర్శించుకుంటారు. శ్రీకాకుళంలోని ప్రభుత్వ అతిథిగృహంలో రాత్రి బస చేస్తారు. శుక్రవారం ఉదయం 8గంటలకు అరసవల్లిలో ఆదిత్యుడిని దర్శించుకుంటారు. 10.30 గంటలకు కలెక్టరేట్‌లో అధికారులతో 2019-2022 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి అంచనాలను సమీక్షిస్తార'ని కలెక్టర్ వెల్లడించారు.

తుఫాన్ అలజడి

- జిల్లాకు 29, 30 తేదీల్లో భారీ వర్షసూచన
- ఆందోళనలో రైతులు
- వరిపంటను కాపాడుకునేందుకు పాట్లు



టెక్కలిపాడు - జమ్ము గ్రామాల మధ్య వరికుప్పలు పెడుతున్న రైతులు

నరసన్నపేట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అన్నదాతల్లో తుఫాన్ అలజడి రేగుతోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా మారనుంది. శుక్రవారం నాటికి ఇది తుఫాన్‌గా మారి జిల్లాలో ఈ నెల 29, 30 తేదీల్లో వర్షాలు పడే అవకాశం ఉందని వాతావారణ శాఖ ప్రకటించింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 3.80 లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. ఇప్పటికే 1.5 లక్షల ఎకరాల్లో వరి కోతలు పూర్తి కాగా (మిగతా 7వ పేజీలో..)

అప్రమత్తంగా ఉండాలి

- మంత్రి అచ్చెన్నాయుడు



కోటబొమ్మాళి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. మంగళవారం నిమ్మాడలోని క్యాంపు కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. 'తుఫాన్ ప్రభావం తీవ్రత రానున్న 48గంటల్లో పెరిగే అవకాశం ఉంది. రైతులు అప్రమత్తంగా ఉండాలి. క్షేత్ర స్థాయిలో వ్యవసాయశాఖ అధికారులు పర్యటించి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలి. కోత కోసిన వరి పంటను భద్రం చేసేందుకు వ్యవసాయశాఖ కార్యాలయాల్లో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి. అవసరమైతే రైతులు వాటిని వినియోగించుకోవాలి. సముద్రం అలజడిగా మారుతున్న నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లరాదు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు, రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాల'ని మంత్రి అచ్చెన్న ఆదేశించారు.



రబీకి సన్నద్ధం

- 72వేల హెక్టార్లలో సాగుకు ప్రణాళిక
- అపరాలకే అగ్రతాంబూలం
- రాగులు, మినుములపై ప్రధాన దృష్టి
- విత్తనాలపై భారీ రాయితీలు
- అందుబాటులో యూరియా నిల్వలు

శ్రీకాకుళం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ముగియడంతో జిల్లా రైతులు రబీ సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఈ మేరకు జిల్లా వ్యవసాయశాఖ అధికారులు ప్రణాళికను సిద్ధం చేశారు. నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా మొత్తం 72,454 హెక్టార్లలో వివిధ పంటలను సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈసారి వరి కంటే ఆరుతడి పంటలు, చిరుధాన్యాల సాగుకే అధికారులు, రైతులు మొగ్గు చూపుతుండటం విశేషం. రబీ సీజన్‌లో అత్యధిక విస్తీర్ణంలో మినుములు, రాగులు సాగు కానుండగా.. ఆ తర్వాత స్థానంలో మొక్కజొన్న, ఇతర చిరుధాన్యాలు ఉన్నాయి. వ్యవసాయశాఖ రూపొందించిన ప్రణాళిక ప్రకారం మినుములు 21,349 హెక్టార్లు, రాగులు 19,048 హెక్టార్లు, మొక్కజొన్న 15,991 హెక్టార్లు, చిరుధాన్యాలు (మిల్లెట్లు) 15,940హెక్టార్లు, పెసలు 13,632 హెక్టార్లు, వరి 7,973 హెక్టార్లు, ఉలవలు (మిగతా 7వ పేజీలో..)

పకడ్బందీగా ధాన్యం కొనుగోలు

- పనితీరు మెరుగుపడని కేంద్రాలు రద్దు చేస్తాం
- నిర్లక్ష్యం చూపే అధికారులకు షోకాజ్ నోటీసులు: జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్



శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా, వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జిల్లా, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ కొన్ని ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ మందకొడిగా ఉండడంపై అసంతృప్తి చెందారు. జలుమూరులో కనీసం ఒక్క ట్రక్‌షీట్, ఎఫ్‌టీఓ కూడా చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల పరిధిలో ధాన్యం సేకరణ నెమ్మదిగా జరుగుతోందని, పనితీరు మెరుగుపరచుకోవాలని స్పష్టం చేశారు. పనితీరు బాగోలేని కొనుగోలు కేంద్రాలను రద్దు చేస్తామని హెచ్చరించారు. అనంతరం వివిధ ప్రభుత్వ పథకాల అమలులో ర్యాంకులు మెరుగుపరచుకోవాలని తెలిపారు. 'అన్న క్యాంటీన్‌ల పనితీరులో ప్రస్తుతం 18వ ర్యాంకులో ఉన్నాం. దీనిని మెరుగుపరచాలి. భోజనాల నాణ్యత, పరిసరాలు, ప్లేట్‌ల పరిశుభ్రత, సమయపాలన విషయంలో నిరంతర పర్యవేక్షణ ఉండాలి. ఆర్టీసీ విభాగంలో 8వ ర్యాంకు నుంచి ఒకటో స్థానానికి చేరుకునేలా అధికారులు కృషి చేయాలి. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం అమలులో రాష్ట్రంలో జిల్లా 5వ స్థానంలో ఉన్నా, సరుబుజ్జిలి వంటి ప్రాంతాల్లో బాగా వెనుకబడి ఉంది. దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలి. గ్రీవెన్స్‌లో అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలి. పంచాయతీరాజ్, డీఆర్డీఏ, డ్వామా, డీఈఓ, రూరల్ ఎస్‌ఐ వంటి శాఖల్లో ఫిర్యాదుల పరిష్కారంలో నాణ్యత లేదు. ఎండార్స్‌మెంట్ ఈ విషయంలో పొరపాట్లను సహించేది లేదు. నిర్లక్ష్యం చూపే అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తాం. పారిశుధ్యం విషయంలో అధికారులు మరింత పకడ్బందీగా పనిచేయాల'ని జేసీ తెలిపారు.

ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు రాకూడదు 8లో

టెక్కలిలోకి నందిగాం



- పలాస డివిజన్ నుంచి మారుస్తూ నిర్ణయం
- మంత్రుల కమిటీ సిఫారసులకు ఆమోదముద్ర
- తీరనున్న ప్రజల కష్టాలు
- మరింత చేరువ కానున్న పరిపాలనా సేవలు

శ్రీకాకుళం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లా సౌకర్యమే లక్ష్యంగా.. పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. జిల్లాలో రెవెన్యూ డివిజన్ల పరిధిలో మార్పులు చేస్తూ మంత్రుల కమిటీ ఇచ్చిన నివేదికపై మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంత్రి వర్గంతో సమీక్ష నిర్వహించారు. పలాస రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న నందిగాం మండలాన్ని టెక్కలి రెవెన్యూ డివిజన్‌లో విలీనానికి ఆమోదం తెలిపారు. దీంతో పాలన మెరుగుపడనుందని, ప్రయాణ భారం తగ్గనుందని ఈ ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- త్వరలో గెజిట్ నోటిఫికేషన్

జిల్లాల పునర్విభజన, రెవెన్యూ డివిజన్ల సవరణలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, అధికారుల నివేదికలను పరిశీలించేందుకు ప్రభుత్వం మంత్రుల కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను, భౌగోళిక పరిస్థితులను అధ్యయనం చేసిన ఈ కమిటీ.. నందిగాం మండలాన్ని పలాస నుంచి తప్పించి, టెక్కలి డివిజన్‌లో కలపాలని ప్రభుత్వానికి సిఫారసు చేసింది. దీనిని నిశితంగా పరిశీలించిన రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీనికి సంబంధించి త్వరలోనే గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసి అధికారికంగా నందిగాం మండలాన్ని టెక్కలి డివిజన్ పరిధిలోకి బదలాయించే ప్రక్రియను పూర్తి చేయనున్నారు. దీంతో టెక్కలి నియోజకవర్గంలో మండలాలన్నీ ఆ డివిజన్ పరిధిలోనే ఉండనున్నాయి.

- ప్రజలకు తప్పనున్న దూరాభారం..

నందిగాం మండలం భౌగోళికంగా టెక్కలికి అత్యంత సమీపంలో ఉంటుంది. పైగా టెక్కలి నియోజకవర్గం (మిగతా 8వ పేజీలో..)

బరంపురం టు కర్ణాటక

- ట్రావెల్స్ బస్సులో గంజాయి రవాణా
- పట్టుబడిన పాత నేరస్థుడు



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు, పోలీసుల అదుపులో గంజాయి నిందితుడు

నరసన్నపేట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం బరంపురం నుంచి కర్ణాటకలోని హుబ్లీకి ట్రావెల్స్ బస్సులో గంజాయి తరలిస్తూ.. ఓ పాత నేరస్థుడు నరసన్నపేట పోలీసులకు చిక్కాడు. ఇందుకు సంబంధించి సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 'మైసూర్‌కు చెందిన అబ్దుల్‌సమద్ 20 కేజీల గంజాయిని ట్రావెల్ బస్సులో తరలిస్తూ పట్టుబడ్డాడు. మంగళవారం మడపాం టోల్‌ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేయగా.. అబ్దుల్‌సమద్ బస్సు దిగి పారిపోయేందుకు ప్రయత్నించాడు. అతడి బ్యాగును పరిశీలించగా గంజాయి ప్యాకెట్లు లభించాయి. గంజాయిని (మిగతా 8వ పేజీలో..)

ఉద్దానంలో ఎలుగుల హల్‌చల్

- ప్రజల్లో భయాందోళన



అంబుగాం బొడ్లూరు- రట్టి రోడ్డులో సంచరిస్తున్న ఎలుగులు

హరిపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఉద్దానం ప్రాంతంలో ఎలుగుబంట్లు సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మందస మండలం అంబుగాం పంచాయతీ అంబుగాం బొడ్లూరు, నేతువార, లింబుగాం తదితర గ్రామాల పరిధిలో ఎలుగులు సంచరిస్తున్నాయి. మంగళవారం ఉదయం అంబుగాం బొడ్లూరు- రట్టి రోడ్డులో మూడు ఎలుగులు కనిపించడంతో స్థానికులు ఆందోళన చెందారు. గతేడాది ఎర్రముక్కాం, దున్నూరు గ్రామాల్లో ఎలుగుబంట్లు దాడి చేసి.. కొందరినీ చంపేశాయని పేర్కొన్నారు. ప్రస్తుతం రాత్రీపగలు ఎలుగుబంట్లు సంచరిస్తూ గ్రామాల్లోకి వస్తుండడంతో ఎప్పుడు ఎవరిపై దాడి చేస్తాయోమోనని భయంగా ఉందన్నారు. సాయంత్రం ఆరు గంటలు దాటితే ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. పగలు జీడితోటలు శుభ్రం చేసే పనులు కూడా వెళ్లలేకపోతున్నామని తెలిపారు. అధికారులు స్పందించి ఎలుగుల నుంచి రక్షణ కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

శ్రీకాకుళంలో కొత్త నర్సింగ్ కాలేజీకి అనుమతి 7లో

రైతే దేశానికి వెన్నెముక
- వారికి అండగా ఉంటాం
- లాభసాటి వ్యవసాయం చేయాలి
- 'రైతన్నా మీకోసం'లో ఎమ్మెల్యేలు, అధికారులు
8లో



బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో నిర్మించిన ఎన్టీఆర్ పరిపాలనా భవనం

నేడు బీఆర్ఏయూలో పరిపాలనా భవనం ప్రారంభం

ఎచ్చెర్ల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో సుమారు రూ.38 కోట్లతో ఆధునిక సౌకర్యాలతో నిర్మించిన డాక్టర్ ఎన్టీఆర్ పరిపాలనా భవనాన్ని బుధవారం ఉదయం 11 గంటలకు ప్రారంభించనున్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ భవనాన్ని అందుబాటులోకి తేనున్నారు. జీ ప్లస్ 4 సముదాయంగా నిర్మించిన ఈ నూతన భవనంలో స్నాతకోత్సవ, పెద్ద సెమినార్ హాల్‌లు రెండేసి వంతున ఉన్నాయి. పాలక మండలి, సెనేట్ హాళ్లు ఉన్నాయి. వర్సిటీలో వీసీ, రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు సీడీసీ, అకడమిక్ అఫైర్స్, ఎస్ఎస్ఎస్, ప్రిన్సిపాల్స్‌కు సంబంధించిన పాలనా విభాగాలు ఈ నూతన భవనంలోనికి మారనున్నాయి. పరీక్షల విభాగం, డీన్‌ల కార్యాలయాలు కూడా అందులోనే ఏర్పాటు కానున్నాయి. వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని మాట్లాడుతూ వర్సిటీలో మరిన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన పీఎం ఉషా నిధుల నుంచి వర్సిటీలో నూతన నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు.

న్యాయస్థానంలో 'థర్మల్' పోరాటం

- కమిటీ తీర్మానం
- పోలీసు వలయంలో థర్మల్ ప్రాంతం



వెన్నెలవలసలో థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యుల వినూత్న నిరసన

సరుబుజ్జిలి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సరుబుజ్జిలి, బూర్జ మండలాల సరిహద్దు గిరిజన ప్రాంతంలో ప్రభుత్వం తలపెట్టిన థర్మల్ పవర్‌ప్లాంట్ నిర్మాణాన్ని అడ్డుకోవడానికి న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ తీర్మానం చేసింది. మంగళవారం కమిటీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి.. సరుబుజ్జిలి మండల కేంద్రంలో ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించడానికి పోరాట కమిటీ



భారీగా మోహరించిన పోలీసులు

చర్యలు చేపట్టింది. అయితే ఎటువంటి అనుమతులు లేని పోరాట కమిటీ చర్యలను అడ్డుకోవాలని శ్రీకాకుళం డీఎస్పీ సి.హెచ్.వివేకానంద ఆధ్వర్యంలో సుమారు 250 మంది పోలీసులు మంగళవారం థర్మల్ ప్రతిపాదిత ప్రాంతంలో ఉన్న గిరిజన గ్రామాలను చుట్టుముట్టారు. సరుబుజ్జిలి తహసీల్దార్ కార్యాలయం నుంచి వెన్నెలవలస, అడ్డూరిపేట, బొడ్లపాడు, మశానపుట్టి తదితర గ్రామాల పరిసర ప్రాంతాల్లో పోలీసు పహారా ఏర్పాటు చేశారు. దీంతో చేసేది లేక రాష్ట్ర ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఉపాధ్యక్షులు వాబ యోగేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, రైతు కూలీ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు వంకల మాధవరావు ఆధ్వర్యంలో వెన్నెలవలస గ్రామంలోనే నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని పురుషులు, మహిళలు బాణాలు చేత పట్టి వినూత్న నిరసన తెలిపారు. అనంతరం ర్యాలీగా నాయకులు, నిరసనకారులు ముందుకు వెళుతున్న సమయంలో ఆమదాలవలస సీఐ పి.సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు వెన్నెలవలస గ్రామానికి చేరుకున్నారు. ఎటువంటి ర్యాలీలు నిర్వహించకూడదని.. శాంతియుతంగా నిరసన తెలుపుకోవడానికి అభ్యంతరం లేదని అన్నారు. ఈ సందర్భంగా కమ్యూనిస్టు నాయకులు మాట్లాడుతూ థర్మల్ పవర్‌ప్లాంట్ నిర్మాణానికి వ్యతిరేకంగా చేపడుతున్న నిరసన కార్యక్రమాలను ప్రభుత్వం అడ్డుకోవడంతో పాటు పోలీసులతో నిర్బంధానికి గురి చేస్తోందని ఆరోపించారు. దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు. భవిష్యత్తులో భారీ నిరసన కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ప్రభుత్వంతో పాటు స్థానిక ఎమ్మెల్యే ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడకుండా.. సాగునీటి ప్రాజెక్టులు, ఇతర మార్గాల ద్వారా ఉద్యోగాలు కల్పించాలన్నారు. అనంతరం సరుబుజ్జిలి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎస్.కృష్ణవేణి, వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షులు బి.సురేష్‌దొర, కార్యదర్శి ఎస్.సింహాచలం, కోశాధికారి అత్తులూరి రవికాంత్, సీపీఎం, సీపీఐ, సీఐటీయూ, రైతు కూలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఫ్యాషన్







వేడుకల్లో లెహంగా, శారీస్‌ను ఎంచుకోడానికి వెనకాడేవారు నిరభ్యంతరంగా షరారాలను ఎంచుకోవచ్చు. సౌకర్యం, స్టైల్‌కు పెద్ద పీట వేసే డిజైనర్ షరారాలు అన్ని వేడుకలకూ అనువుగా ఉంటాయి. తాజాగా ట్రెండ్ అవుతున్న వాటి మీద ఓ లుక్కేద్దాం!

షరారా షరారా

పండుగలు, పెళ్లిళ్లు, పుట్టిన రోజు వేడుకలు.. ఇలా అన్ని రకాల వినోదాల్లో ధరించడానికి వీలుండే దుస్తులు.. డిజైనర్ షరారాలు. ప్రస్తుతం ఇవి ట్రెండ్‌గా మారాయి. డిజైనర్లు ఆధునికత ఉట్టిపడే డిజైనర్ వెర్షన్లను రూపొందిస్తూ ఉండడంతో, కొత్త కొత్త హంగులతో, ఫ్యూజన్ స్టైల్స్‌తో షరారాలు మహిళల మనసులను దోచుకుంటున్నాయి. మరీ ముఖ్యంగా వధువులు కూడా రిసెప్షన్స్, ఎంగేజ్‌మెంట్ ఫంక్షన్ల కోసం డిజైనర్ షరారాలనే ఎంచుకుంటూ ఉండడం చెప్పుకోదగిన విశేషం. జారుతున్నట్టు క నిపించే మెటీరియల్స్, రిల్యాక్స్‌డ్ ఫిట్టింగ్స్‌తో రూపొందుతున్నాయి కాబట్టి వీటిని ధరించడమూ సులభమే! ప్రత్యేకించి లెహంగాలతో పోలిస్తే షరారాలతో రెట్టింపు సౌకర్యం ఉంటుంది.

తాజా ట్రెండ్స్ ఇవే!

- ఎంబ్రాడిరీ, అద్దం పనితనం: సంక్లిష్టమైన ఎంబ్రాయిడరీ, అద్దం పనితనంతో కూడిన షరాలు తాజా ట్రెండ్‌గా మారాయి
- ప్రింటెడ్ డిజైన్లు కూడా బాగా ఆదరణ పొందుతున్నాయి
- చందేరి, ఇతరత్రా తక్కువ బరువుండే వస్త్రాలతో రూపొందే షరారాలు ప్రత్యేకించి వేసవి వస్త్రాలుగా పేరు తెచ్చుకుంటున్నాయి
- సంప్రతాయ, సమకాలీన స్టైల్స్‌ను మేళవించి, రూపొందిస్తున్న డిజైనర్ షరారాలు ఆధునిక ఫ్యూజన్ ఛాయిస్‌గా పేరు తెచ్చుకుంటన్నాయి.

అదనపు హంగులు జోడించి...

షరారాలతో భారీ ఆభరణాలు చాలా బాగా నప్పుతాయి. ఈ దుస్తుల కోసం చాంద్‌బాలీ, కంగన్ లేదా కడా లాంటి ఆభరణాలు ఎంచుకోవచ్చు. చమ్కీ పనితనానికి రాళ్ల నగలు చక్కగా నప్పుతాయి. హైహీల్స్ లేదా బ్లంట్ హీల్స్ ధరించాలి.

పశువుల్లో కృత్రిమ గర్భధారణపై పాడి రైతులకు అవగాహన కల్పించడానికి నిరంతరం కృషి చేస్తున్నారు చాకలి అనురాధ. నంద్యాల జిల్లా చింతకుంటలో జూనియర్ వెటర్నరీ అధికారి అయిన ఆమె.. తన సేవలకు గుర్తింపుగా 'జాతీయ గోపాలరత్న' పురస్కారాన్ని కేంద్ర ప్రభుత్వం నుంచి నేడు అందుకోబోతున్నారు. "పాడి పరిశ్రమ అభివృద్ధికి రైతుల్లో చైతన్యమే మార్గం" అంటున్న అనురాధను 'నవ్య' పలకరించింది.

ఈ అనురాధ గోపాల మిత్ర



"నా స్వస్థలం ప్రస్తుత నంద్యాల జిల్లా గోస్పాడు మండలం జిల్లెల్ల గ్రామం. నా తల్లిదండ్రులు చాకలి లక్ష్మీదేవి, సుబ్బారాయుడు. వారిది రజక వృత్తి. పేదరికం వల్ల మేము ఎన్నో ఇబ్బందులు పడ్డాం. నేను పదో తరగతి వరకూ మా ఊరిలోనే చదువుకున్నాను. నంద్యాలలో ఇంటర్మీడియెట్ పూర్తి చేశాను. నా మేనమామ రవిశంకర్‌తో నా వివాహం అయింది. మాకు ఇద్దరు పిల్లలు... రిషిత, యోగీశ్వర్. నా భర్త ప్రోత్సాహంతో 2004లో వెటర్నరీ అసిస్టెంట్ పోస్టు కోసం పరీక్ష రాశాను. సుమారు 350 మంది పోటీ పడితే... ఎంపికైన ఆరుగురిలో నేనొకరిని. శిక్షణ తరువాత, 2006లో... బండి ఆత్మకూరులో కాంట్రాక్ట్ విధానంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరాను. రెండేళ్ల తరువాత ఉద్యోగం రెగ్యులర్ అయింది. ఆ తరువాత గడివేముల మండలం బిలకలగూడూరులోని రూరల్ లైవ్ స్టాక్ యూనిట్‌లో (ఆర్ఎల్‌యూ) లైవ్ స్టాక్ అసిస్టెంట్‌గా పని చేశాను. 2019లో జూనియర్ పశువైద్యాధికారి (జేవీఓ)గా పదోన్నతి పొందాను. ఆరేళ్లపాటు మహానంది మండలం గోపవరంలో పని చేశాను.

'ట్రిపుల్-ఎస్ అనురాధ' అంటారు

ఆ సమయంలోనే కేంద్ర ప్రభుత్వం 'సెక్స్-సోర్టెడ్ సెమెన్ ఆర్టిఫిషియల్ ఇన్‌సెమినేషన్ (ట్రిపుల్ ఎస్ఏఐ)' విధానాన్ని అమలు చేసింది. ఈ విధానం పాడి రైతులకు ఉపయోగకరం. దాని గురించి రైతుల్లో అవగాహన కల్పించడానికి క్షేత్రస్థాయిలో అనేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాను. ఎన్నో పశువులకు కృత్రిమ గర్భధారణ ప్రక్రియ నిర్వహించాను. మూడేళ్లలో 345 వరకూ మేలు జాతి ఆడ దూడలు నా పర్యవేక్షణలో జన్మించాయి. ఎక్కువ కృత్రిమ గర్భధారణలు నిర్వహించడంతో నన్ను మా శాఖలో 'ట్రిపుల్ ఎస్ అనురాధ' అంటారు. నేను అందించిన సేవలకు ఇలాంటి ప్రత్యేక గుర్తింపు రావడం సంతోషంగా ఉంది. అలాగే... పశువులను సమయానుగుణంగా వాక్సినేషన్ లాంటి కార్యక్రమాలు కూడా పెద్ద ఎత్తున చేపట్టాను. ఈ ఏడాది జూన్ నెలలో గోస్పాడు మండలం చింతకుంటకు బదిలీపై వచ్చాను. విధుల్లో నేను అందించిన సేవలకు గుర్తింపుగా... 2021లో ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయిలో, 2023లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉద్యోగి పురస్కారాలను, ఈ ఏడాది ఆగస్టు 15న జిల్లా స్థాయిలో ఉత్తమ ఉద్యోగి ప్రశంసా పత్రాన్ని అందుకున్నాను. ఇప్పుడు జాతీయ స్థాయిలో అవార్డు అందుకోబోతున్నాను.

వారి ప్రోత్సాహంతో...

కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది 'జాతీయ గోపాలరత్న' అవార్డులు ప్రదానం చేస్తుంది. మూడు కేటగిరీల్లో... ఒక్కొక్క దానికి మూడు చొప్పున మొత్తం తొమ్మిది అవార్డులు అందిస్తారు. ఈ ఏడాది వీటికోసం 2,018 మంది పోటీ పడ్డారు. 'ఉత్తమ కృత్రిమ గర్భధారణ నిపుణుల విభాగం'లో నాకు మూడో స్థానం లభించినట్టు ఈ నెల 17న ప్రకటించారు. దాన్ని నేడు (బుధవారం) ఢిల్లీలోని సుష్మాస్వరాజ్ భవన్‌లో అందుకోబోతున్నాను. ఈ పురస్కారంతో నంద్యాల జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కిందని అందరూ చెబుతూ ఉంటే సంతోషంగా అనిపిస్తోంది. చదువులో నా తల్లిదండ్రులు, ఉద్యోగ ప్రయత్నంలో నా భర్త సహకారంతోనే ఈ స్థాయికి వచ్చాను. ఉద్యోగపరంగా వైద్యులు, అసిస్టెంట్ డైరెక్టర్లు, జిల్లా అధికారులు ఎంతగానో ప్రోత్సహించడంతో.. విధుల్లో చురుకుగా పని చేసి, రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించగలిగాను. ఎక్కువ సంఖ్యలో కృత్రిమ గర్భధారణలకు దోహదం చేశాను. వాటన్నిటి ఫలితమే ఈ పురస్కారం. ఇదే స్ఫూర్తితో... భవిష్యత్తులో పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తాను."

• చదువుల గోపాలకృష్ణ
నంద్యాల

విజేత

సవాళ్లను స్వీకరించడం... అపజయాలను పాఠాలుగా మలుచుకోవడం... లక్ష్యం చేరేవరకు పట్టుదలగా ప్రయత్నించడం... ఇవే ఒక యోధుడిని తయారు చేస్తాయి. అందుకు నిలువెత్తు నిదర్శనం... అనుపమా రామచంద్రన్. కఠిన పరీక్షలు ఎదురైనప్పుడు వెనకడుగు వేయకుండా... క్లిష్ట సమయాల్లో ఒత్తిడికి చిత్తవకుండా... ఆత్మస్థైర్యంతో అందలాన్ని అందుకుంది. ఇటీవల ప్రపంచ స్నూకర్ చాంపియన్‌షిప్ గెలిచిన 23 ఏళ్ల అనుపమ... ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళగా చరిత్ర సృష్టించి... నవ శకానికి నాంది పలికింది.



ఆమె సంకల్పం.. 'అనుపమా'నం

ఖతర్ రాజధాని దోహా... ఐబీఎస్ఎఫ్ ప్రపంచ స్నూకర్ చాంపియన్‌షిప్... అంతిమ సమరం... ప్రత్యర్థి ఎంగ్ఆన్ యీ... మూడుసార్లు ప్రపంచ చాంపియన్. ఎన్నో ఏళ్లుగా నెంబర్ వన్ ర్యాంకర్. కేవలం నైపుణ్యాన్ని మాత్రమే కాకుండా ధైర్యాన్ని పరీక్షించే మ్యాచ్. చివరి ఫ్రేమ్. 2-2 వద్ద విజయం ఊగిసలాడుతోంది. అనుపమా రామచంద్రన్ చేతిలో క్యూ. నవచరిత రాయడానికి షాట్ దూరం. ఒక్క క్షణం ఆగి.. ఆమె గట్టిగా ఊపిరి పీల్చుకుంది. ఒత్తిడిలోకి వెళ్లకుండా తనను తాను స్థిమితంగా ఉంచుకుంది. ఏకాగ్రతతో, పూర్తి నమ్మకంతో షాట్ కొట్టింది. బంతి పాకెట్‌లోకి దూసుకుపోయింది. ఆ ప్రాంతమంతా చప్పట్లు, జయజయ ధ్వానాలతో మార్మోగింది. భారత్‌లో మొట్టమొదటిసారి ఒక మహిళ ప్రపంచ స్నూకర్ చాంపియన్‌గా అవతరించింది. అయితే ఈ గెలుపు అనుపమకు అంత సులువుగా దక్కలేదు. దీని వెనుక నిరంతర కృషి ఉంది. సడలని సంకల్పం ఉంది. దీనికి బలమైన పునాది 2015లో పడింది.

వేసవి క్యాంపుతో...

చెన్నైలో పుట్టి పెరిగిన అనుపమ కోరి స్నూకర్‌ను ఎంచుకోలేదు. ఆట మొదలుపెట్టేవరకూ దానిపై అసలు దాని గురించి తెలియదు. "అప్పుడు నాకు పదమూడేళ్లు. మా ఇంటికి దగ్గర్లో 'మైలాపూర్ క్లబ్' ఉంది. సెలవులు కావడంతో క్లబ్‌లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. అక్కడ చెస్, స్నూకర్ మాత్రమే ఉన్నాయి. చెస్ ఇంట్లో ఆడుతూనే ఉంటాను కాబట్టి, స్నూకర్ నేర్చుకోవాలని అనుకున్నా. అంతే కాదు... ఆకుపచ్చని బోర్డు, రంగురంగుల బాల్స్, చేతిలో క్యూ... చూడగానే నన్ను బాగా ఆకట్టుకున్నాయి. ఎలా ఆడతారో తెలుసుకోవాలన్న ఆసక్తి ఎక్కువైంది. క్యాంపులో చేరాక అందులో లీనమైపోయాను. కోచ్ లో... నా ప్రతిభను చూసి స్నూకర్ కొనసాగించమని చెప్పారు" అంటూ చిన్ననాటి రోజులు గుర్తు చేసుకున్న అనుపమ... వేసవి శిబిరం పూర్తవగానే ప్రొఫెషనల్ కోచింగ్‌లో చేరింది.

అందుకే ప్రత్యేకం

చిన్నప్పుడు కోచ్‌లు అనుపమలో గుర్తించినవి... సడలని ఏకాగ్రత, ఓపిక. సాధారణంగా ఆ వయసు పిల్లల్లో ఈ లక్షణాలు చాలా అరుదుగా కనిపిస్తాయి. వీటిని అలవర్చుకోవడానికి చాలామంది ఆటగాళ్లకు సంవత్సరాలు పడుతుందనేది శిక్షకుల మాట. అందుకే ఆమెను ప్రత్యేక ప్రతిభ గల అమ్మాయిగా పరిగణించారు. ఆ స్థాయిలోనే శిక్షణ ఇచ్చారు.



స్పోర్ట్స్ పెర్ఫార్మెన్స్ స్పెషలిస్టు, తన మామయ్య అయిన కె.నారాయణన్ మార్గదర్శకత్వంలో అనుపమ ఆటలో మరింత పరిణతి సాధించింది. ఆయన నేతృత్వంలో సాంకేతిక అంశాలను ఆకళింపు చేసుకుంది. వ్యూహాలు నేర్చుకుంది. క్లిష్ట సమయాల్లో ఒత్తిడిని ఎలా జయించాలో, మనోధైర్యంతో అడుగులు ముందుకు ఎలా వేయాలో తెలుసుకుంది. నిరంతర సాధనతో పరిపూర్ణ క్రీడాకారిణిగా తనను తాను తీర్చిదిద్దుకుంది.

మలుపు తిప్పిన గెలుపు

స్నూకర్, ఇంగ్లీష్ బిలియర్డ్స్‌లో ఎంతో పరిణతి సాధించిన అనుపమ.. జిల్లా, రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయ స్థాయిలోనూ అదరగొట్టింది. ఏకంగా ఎనిమిది జాతీయ జూనియర్ టైటిల్స్ నెగ్గిన ఆమె కెరీర్‌ను 2017లో రష్యాలో జరిగిన 'వరల్డ్ ఓపెన్ అండర్-16 స్నూకర్ చాంపయిన్‌షిప్' మలుపు తిప్పింది. అంచనాలు తలకిందులు చేస్తూ విజేతగా నిలిచింది. దాంతో అనుపమ సీనియర్ విభాగంపై కూడా దృష్టి పెట్టింది. 2023లో 'ప్రపంచ మహిళల అండర్ 21 స్నూకర్ టైటిల్ సాధించింది. మరుసటి ఏడాది 'యూఎస్ ఉమెన్స్ ఓపెన్'లో రన్నరప్‌గా నిలిచి ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. దాంతో ఈ ఏడాది ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానం దక్కించుకుంది. ఆమె కెరీర్ ఇదే అత్యున్నత ర్యాంక్.

ప్రపంచ చాంపియన్...

చిన్న వయసులోనే ఎన్నో మైలురాళ్లను అధిగమించిన అనుపమ... చదువును అశ్రద్ధ చేయలేదు. చెన్నైలోని 'విద్యా మందిర్ సీనియర్ సెకండరీ స్కూల్‌'లో చదివిన ఆమె, ప్రస్తుతం వైష్ణవ్ మహిళా కళాశాలలో పబ్లిక్ పాలసీలో పీజీ చేస్తోంది. అంతర్జాతీయ స్థాయి పోటీపడుతూనే... అటు ఆటను, ఇటు చదువును సమన్వయం చేసుకొంటోంది. ఇక ఈ నెల రెండో వారంలో దోహాలో జరిగిన 'ఐబీఎస్ఎఫ్ ప్రపంచ స్నూకర్ చాంపియన్‌షిప్'లో టాప్ ర్యాంకర్‌ను ఓడించి నవ శకానికి నాంది పలికింది. భారత్‌ను చాంపియన్‌గా నిలబెట్టింది. ఈ గెలుపు ఆమెది మాత్రమే కాదు... ఈ క్రీడలో రాణించాలని కలలు కనే అమ్మాయిలు అందరిదీ. భారతీయ స్నూకర్‌ది. నిశ్శబ్దంగా, ఓపికగా, పట్టుదలగా, ఒక్కో అడుగు ముందుకు వేస్తూ... శిఖరాగ్రానికి చేరిన దృఢ సంకల్పానిది.

ముఖానికి నెయ్యి రాస్తే...



ఆరోగ్యంతోపాటు చర్మ సౌందర్యాన్ని పెంపొందించడంలో నెయ్యి కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ముఖానికి నెయ్యి రాసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకుందాం...

- వయసు పెరిగే కొద్దీ ముఖం మీద ముడుతలు, గీతలు ఏర్పడుతుంటాయి. వీటిని నివారించేందుకు యాంటీ ఏజింగ్ క్రీమ్‌లు, మాయిశ్చరైజర్లు వాడేబదులు ముఖానికి నెయ్యి రాసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. నెయ్యిలో యాంటీ ఆక్సిడెంట్లతోపాటు చర్మానికి పోషణను అందించే ఎ, డి, ఇ, కె విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మంలో కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతాయి. దీంతో చర్మం మృదువుగా కాంతివంతంగా మారుతుంది.
- నెయ్యిని ముఖానికి పట్టించి చేతి వేళ్లతో సున్నితంగా వృత్తాకారంలో మర్దన చేయాలి. దీనివల్ల చర్మానికి రక్తప్రసరణ పెరుగుతుంది. చర్మకణాలు వృద్ధి పొందుతాయి. దీంతో చర్మానికి సహజసిద్ధమైన మెరుపుదనం చేకూరుతుంది. ముఖానికి మేకప్ అవసరం రాదు.
- వాతావరణ కాలుష్యం, ఎండ, దుమ్ము, ధూళి వల్ల ముఖం మీద మొటిమలు, మచ్చలు, దద్దులు, ట్యానింగ్ లాంటి సమస్యలు ఏర్పడుతుంటాయి. అలాంటప్పుడు బయటి నుంచి రాగానే ముఖాన్ని గోరువెచ్చని నీళ్లతో శుభ్రం చేసుకుని కొద్దిగా పేరిన నెయ్యి రాసుకుంటే చాలు. మునుపటి నిగారింపు వచ్చేస్తుంది. నెయ్యిలోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు చర్మాన్ని సంరక్షిస్తాయి.
- రోజూ రాత్రి పడుకునేముందు ముఖానికి నెయ్యి రాసుకుంటూ ఉంటే చర్మం తేమతో నిండుతుంది. ముఖం ఛాయగా మెరుస్తుంది కూడా.
- చిన్న గిన్నెలో ఒక చెంచా నెయ్యి, పావు చెంచా పసుపు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని చూపుడు వేలితో కొద్ది కొద్దిగా తీసుకుంటూ ముఖానికి పట్టించాలి. పావుగంటసేపు విశ్రాంతి తీసుకున్న తరువాత గోరువెచ్చని నీళ్లతో శుభ్రం చేసుకుంటే ముఖం ప్రకాశవంతంగా కనిపిస్తుంది.

విభిన్నం

87 ఏళ్ల వయసులో స్కూటర్ నడపడమే కాదు, షోలే సినిమాను తలపించేలా చెల్లిని వెంటేసుకుని మరీ రయ్యిన దూసుకుపోతున్నారు అహ్మదాబాద్‌కు చెందిన మందాకినీ షా. మహిళా మండళ్లు, పంచాయితీ సమావేశాలతో నిరంతరం బిజీ బిజీగా ఉండే మందాకిని, సమాజ సేవ గురించీ, స్కూటర్‌తో ఏర్పడిన అనుబంధం గురించి ఇలా వివరిస్తున్నారు...

బైకర్ బామ్మ..!



"నా పేరు మందాకినీ షా. నాకు 87 ఏళ్లు. చెల్లెలు ఉషతో కలిసి, స్కూటర్ మీద చక్కర్లు కొట్టడమంటే నాకు చాలా ఇష్టం. నేను అహ్మదాబాద్‌లోనే పుట్టి పెరిగాను. మేం ఐదుగురం అక్కాచెల్లెళ్లం. మాకొక తమ్ముడు కూడా ఉన్నాడు. అందర్లోకీ నేనే పెద్దదాన్ని కాబట్టి జీవితపాఠాలను ఎంతో ముందుగానే నేర్చేసుకున్నాను. స్వాతంత్రసమరయోధుడైన నాన్న, నా చిన్నతనంలో ఏదో ఒక వ్యాపారంలో స్థిరపడాలని పరితపించేవారు. కానీ అందుకు సరిపడా డబ్బు మా దగ్గర ఉండేది కాదు. దాంతో వ్యాపారం చేయలేకపోయారు. అమ్మ ఎంతో కష్టపడి మమ్మల్ని పెంచింది. ఆమె కష్టాన్ని చూస్తూ పెరిగానేమో, వీలైనంత త్వరగా నా కాళ్ల మీద నేను నిలబడాలని నిర్ణయించుకున్నాను. అందుకే కాలేజీ చదువు వద్దనుకుని, బడి చదువు పూర్తవగానే ఉద్యోగంలో చేరిపోయాను. అలా 16వ ఏట బాలమందిర్‌లో టీచర్‌గా పని చేయడం మొదలుపెట్టాను.

సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొంటూ..

నాకు ఇంగ్లీషు అంతగా రాదు. కానీ జీవితంలో ఏదైనా సాధించాలనే పట్టుదల బలంగా ఉండేది. దాంతో సమాజ సంక్షేమ పథకాల్లో చేరిపోయాను. మహిళా మండళ్లను కలుస్తూ, పంచాయితీ సమావేశాల్లో పాల్గొంటూ మహిళా హక్కుల గురించి బోధించడం మొదలుపెట్టాను. అలా దుమ్ము లేచే రోడ్ల మీద వేర్వేరు చోట్లకు ప్రయాణాలు చేసే క్రమంలో, స్కూటర్, జీప్ నడపడం నేర్చేసుకున్నాను. ఆ తర్వాత ఒక సెకండ్ హ్యాండ్ స్కూటర్ కొనుక్కున్నాను. స్కూటర్ చేతిలో ఉంటే, ప్రయాణాలకు వెనకాడే పరిస్థితి ఉండదు. అయితే పెద్ద వయసులో ఒక మహిళ స్కూటర్ నడపడమన్నది ఆశ్చర్యకరమైన విషయమే! అందరూ వింతగా చూసేవారు. అక్కడితో ఆగితే ఫరవాలేదు. చాలా ఏళ్ల పాటు నన్నొక ప్రశ్నతో ఇబ్బంది పెట్టారు.

16 ఏళ్ల యువతిలా...

'మీకు పెళ్లి కాలేదా? మీరు విధవా?' అనే వాళ్ల ప్రశ్న నన్ను చాలా కాలం ఇబ్బంది పెట్టింది. వాళ్లకు.. ఒక ఒంటరి మహిళ, ముగియని కథ లాంటిది. కానీ నిజానికి నా కథ కాస్త ఆలస్యంగా మొదలైందనే విషయం వాళ్లకు తెలియదు. ఒకానొక సందర్భంలో నేను కూడా పెళ్లి చేసుకోవాలనుకున్నాను. కానీ మనం అనుకున్నట్టు సాగితే అది జీవితం ఎలా అవుతుంది? అందుకే జీవితంతో రాజీ పడిపోయాను. ట్రాఫిక్ పోలీసులు ఇప్పటికీ... 'అమ్మా మీరు స్కూటర్ ఎందుకు నడుపుతున్నారు?' అని అడుగుతూ ఉంటారు. ఆ ప్రశ్నకు చిరునవ్వే నా సమాధానం. స్కూటర్ నడుపుతున్నప్పుడు ముఖాన్ని స్పృశించే గాలి, నన్ను 16 ఏళ్ల యువతిననే భావనకు లోను చేస్తుందని ఎంతమందికి చెప్పను? వయసు నాలో సత్తువను తగ్గిస్తూ ఉండవచ్చు. కానీ మనసులో పట్టుదలను సడలించలేకపోయింది. నేనిప్పటికీ చెల్లి ఉషను వెంటబెట్టుకుని వేర్వేరు ఊర్లు తిరుగుతూ ఉంటాను. ప్రతిరోజూ స్నేహితులను కలుసుకుంటూ ఉంటాను. ఆటపాటలతో కాలక్షేపం చేస్తూ ఉంటాను. 80ల్లో ఉన్నాను కాబట్టి ఇక్కడితో నా కథ కంచికే అనుకుంటే పొరపాటు, సమాజం ఊహించని జీవితం జీవించాను. నా కథ ముగియడానికి ఇంకా ఎంతో సమయం మిగిలిఉంది."

తుఫాన్ అలజడి

(ఐదో పేజీ తరువాయి)

సుమారు 60వేల ఎకరాల్లో నూర్పులు కూడా చేపట్టారు. ధాన్యం రోడ్ల మీద.. కళ్లాల్లో ఉన్నాయి. జిల్లాలో గార, శ్రీకాకుళం రూరల్, ఆమదాలవలస, సరుబుజ్జిలి, ఎల్.ఎన్.పేట, హిరమండలం, కొత్తూరు, పాతపట్నం, సారవకోట, టెక్కలి, జలుమూరు, నరసన్నపేట, పోలాకి మండలాల్లో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ సమయంలో తుఫాన్ హెచ్చరికలతో రైతులు దిగులు చెందుతున్నారు. వాతావరణంలో మార్పుల కారణంగా మంగళవారం మబ్బులు వేయడంతో కోతలు నిలిపేశారు. వరిపనలు కుప్పలుగా వేసి భద్రపరిచే పనిలో నిమగ్నమయ్యారు. ఇదిలా ఉండగా వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. వరి పంట కోతలు కోయొద్దని, కోసిన పంటను కళ్లాల్లో భద్రపరచుకోవాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని ఆంక్షలు విధించారు.

రబీకి సన్నద్ధం

(ఐదో పేజీ తరువాయి)

795 హెక్టార్లలో సాగు చేయనున్నారు. మిగిలిన విస్తీర్ణంలో శనగ, జనుము పండించనున్నారు.

● **రాయితీపై విత్తనాలు..**

రబీ సాగును ప్రోత్సహించేందుకు రైతులపై పెట్టుబడి భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం విత్తనాలపై రాయితీలను ప్రకటించింది. పెసర, మినుము, శనగ తదితర అపరాల విత్తనాలను వ్యవసాయశాఖ అధికారులు 50 శాతం రాయితీపై సరఫరా చేస్తున్నారు. వరి విత్తనాలకు సంబంధించి కిలోకు రూ.5 చొప్పున రాయితీ అందిస్తున్నారు. అలాగే ఎరువుల ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం జిల్లాలో 3,200 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు సిద్ధంగా ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, సూచనలు అందించేందుకు రైతుసేవా కేంద్రాల సిబ్బందిని కూడా సన్నద్ధం చేశారు.

కొత్త నర్సింగ్ కాలేజీకి అనుమతి

అరసవల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో నూతనంగా బీఎస్సీ నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అనుమతి జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి సౌరబ్ గౌర్ మంగళవారం ఉత్తర్వులను విడుదల చేశారు. కశ్యప్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ పేరుతో అన్నపూర్ణ కమర్షియల్ కాంప్లెక్స్, మెయిన్ రోడ్డు, కొత్త రోడ్డు జంక్షన్, శ్రీకాకుళంలో ఈ కాలేజీ ఏర్పాటు కానుంది. ఏడాదికి 40 బీఎస్సీ నర్సింగ్ సీట్లు, అలాగే విద్యార్థుల క్లినికల్ శిక్షణ కోసం నగరంలోని 200 పడకల కిమ్స్ సాయి శేషాద్రి ఆసుపత్రితో అనుసంధానం కలిగి ఉంటుంది. ఈ కళాశాల డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ, న్యూఢిల్లీలోని ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ అనుమతులను పొందాల్సి ఉంటుంది. అనుమతి లభించిన ఏడాదిలోగా కోర్సులను ప్రారంభించాలి. హెల్త్ యూనివర్శిటీ నిబంధనలకు అనుగుణంగా బోధనా సిబ్బంది, తరగతి గదులు, హాస్టల్ లైబ్రరీ వంటి మౌలిక సదుపాయాలు తప్పనిసరి. నిబంధనలు ఉల్లంఘించినా, విద్యార్థుల ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించినా అనుమతి రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుందని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

కూటమి ప్రభుత్వంలో సమస్యల పరిష్కారం

అరసవల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో కార్మికులతో చేసుకున్న ఒప్పందాలను తుంగలో తొక్కి నష్టం చేశారని తెలుగునాడు విద్యుత్ కార్మికుల సంఘం ప్రాంతీయ కార్యదర్శి కె.వైకుంఠరావు అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఈ ప్రభుత్వంలో ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి సమస్యలను తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి మళ్లీ పాత పద్ధతిలో ఉత్తర్వులు ఇటీవల ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా కొత్త సభ్యులను చేర్చుకున్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బీవీ రవీంద్ర, బియ్యంనాయుడు, అడిషనల్ సెక్రటరీ గణేష్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బీవీ రమణమూర్తి, వైకుంఠరావు తదితరులు హాజరయ్యారు.

ఆరుతడి పంటలపై అవగాహన కలిగించాలి



వివరాలు తెలుసుకుంటున్న అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్

రణస్థలం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆరుతడి పంటల సేద్యంపై రైతులకు అవగాహన కలిగించాలని అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్ కుమార్ అన్నారు. మంగళవారం రణస్థలం పంచాయతీలో ఆయన పర్యటించారు. రైతులకు ఆదాయం పెంచేలా వరి పంట నుంచి ఇతర పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. ధాన్యం సేకరణ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయనతో పాటు తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్, సర్పంచ్ పిన్నింటి భానోజి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

యువతతోనే దేశాభివృద్ధి



ప్రతిజ్ఞ చేయిస్తున్న అధ్యాపకులు

గుజరాతీపేట. నవంబరు 25(ఆంధ్రజ్యోతి): యువత సన్మార్గంలో నడిచినట్టయితే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని ప్రిన్సిపాల్ డా.వై.పోలినాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారన్నారు. దీనికి దూరంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆర్.హారిక, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ జి.రాజశేఖర్, ఎన్ఎస్ఎస్ పీవో శ్రీనివాస్ పాత్రో, చలమయ్య, వి.సత్యనారాయణ, ఆర్. వెంకటేశ్వరరావు, ఢిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారుల కోసం రక్తదానం

అరసవల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ సుధాకర్ ఆధ్వర్యంలో స్థానిక రెడ్‌క్రాస్ భవనంలో మంగళవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 30 మండలాల నుంచి వచ్చిన 180 మంది యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ జగన్మోహనరావు మాట్లాడుతూ.. రక్తదానం చేయడం ద్వారా తలసేమియా, సికెల్ సెల్ అనీమియాతో బాధపడుతున్న చిన్నారులకు ప్రాణదానం చేసినట్లయిందన్నారు. ఈ సందర్భంగా రక్తదాతలను అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి పీడీ బి.లవరాజ్, ఏవో నాగేశ్వరరావు, హరిత, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పెంకి చైతన్యకుమార్, జి.రమణ, నరసింహారావు, గుణాకరరావు పాల్గొన్నారు.



రక్తదాతలను అభినందిస్తున్న రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు

మహిళలపై హింసను నిర్మూలించేలా పోరాడాలి

● జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు



మాట్లాడుతున్న జిల్లాన్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి

శ్రీకాకుళం లీగల్, నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి): సమాజంలో రోజురోజుకి మహిళలపై పెరుగుతున్న హింసను నిర్మూలించే దిశగా అందరూ కలిసి పోరాడాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరి బాబు అన్నారు. మంగళవారం స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో మహిళలు హింసను ఎదుర్కోవడంలో చట్టపరమైన అంశాలపై అవగాహన కలిగించారు. జిల్లాన్యాయ సేవాధికార సంస్థ మహిళలకు ఉచితంగా న్యాయ సహాయం అందిస్తుందన్నారు. అవసరమైతే మహిళలకు ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని చెప్పారు. మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకొని తమకు తాము రక్షణ కల్పించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఎం హెచ్‌వో డా.కె.అనిత, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ డి.విమల తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల పేర్లు నమోదు తప్పనిసరి

అరసవల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): గర్భిణుల పేర్లు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని డీఎం హెచ్‌వో డా.కె.అనిత అన్నారు. మంగళవారం డీఎం హెచ్‌వో కార్యాలయ సమావేశ మందిరంలో ఇచ్ఛాపురం, సారవకోట, ఎల్ఎన్.పేట మండలాల ఏఎన్ఎంలు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలతో గర్భిణుల సంరక్షణ, సురక్షిత ప్రసవాలు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణుల పేర్లను మొదటి మూడు నెలల్లోగా నమోదు చేయాలని, పరీక్షలు నిర్వహించి తగు సూచనలు, సలహాలివ్వాలన్నారు. ఒకవేళ అబార్షన్ అయితే ఆర్సీహెచ్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ మూడు మండలాల్లో లింగ నిష్పత్తిలో వ్యత్యాసాలపై కారణాలను ఆరాతీశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ఐ.విమల, డిప్యూటీ డీఎంహెచ్‌వో మేరీ క్యాథరిన్, డీఐవో డా.రాందాసు, ఐసీడీఎస్ నోడల్ అధికారి పి.మణెమ్మ, డిప్యూటీ డెమో కె.ఎర్రన్న, వైద్యాధికారులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఆమదాలవలస, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళా చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి బి.రమ్య అన్నారు. అంతర్జాతీయ మహిళలపై హింస నిరోధక దినోత్సవం సందర్భంగా మంగళవారం మునిసిపల్ కార్యాలయంలో స్వయం సహాయక సంఘ సభ్యులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళల రక్షణ భద్రత కోసం అనేక కఠినమైన చట్టాలున్నాయన్నారు. వీటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపు సత్యనారాయణ, న్యాయ వాదులు ఎస్.గోవిందరావు, కె.త్రినాథరావు, తమ్మినేని అన్నంనాయుడు, హనుమంతు అచ్చెంనాయుడు, బొడ్డేపల్లి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొన్న జూనియర్ సివిల్ న్యాయాధికారి రమ్య

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు: ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గిస్తూ ప్రజల భద్రతను కాపాడేందుకు సమగ్ర కార్యాచరణ అమలు చేస్తున్నామని ఎస్పీ కేవీ మహేశ్వరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రమాద నివారణలో భాగంగా చెక్‌పోస్టులు, టోల్‌ప్లాజాల వద్ద రోడ్లపై ఫేస్‌వాష్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. నిర్దేశించిన ప్రదేశాల్లోనే వాహనాలు పార్కింగ్ చేసేలా సూచనలు చేయడం జరుగుతుందన్నారు. ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో స్పీడ్ బ్రేకర్లు, రేడియం స్టిక్కర్లు, డ్రమ్స్, కచ్చితమైన సిగ్నల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. హైరిస్క్ రూట్లలో ప్రత్యేక నిఘా పెట్టినట్టు వెల్లడించారు. వాహనాల తనిఖీలు కఠినతరం చేస్తామన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ, ప్రమాద ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ విధిగా ధరించాలన్నారు.

గురుకులం అదనపు గదుల పరిశీలన



పరిశీలిస్తున్న పీఎంజే బాబు

శ్రీకాకుళం రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పెద్దపాడు డా.బీఆర్.అంబేడ్కర్ గురుకుల కళాశాలను రాష్ట్ర విద్యాసంక్షేమ, మౌళిక వసతుల డైరెక్టర్ పీఎంజేబాబు మంగళవారం సందర్శించారు. కొత్తగా మంజూరు చేసిన అదనపు తరగతి గదులు, మరమ్మతు పనులను పరిశీలించారు. కళాశాలకు క్రీడామైదానం, తాగునీటి సదుపాయం కల్పించాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసదేవి కోరారు. ఏఈ కిరణ్ పాల్గొన్నారు.

అబుదాబిలో వలస కూలి మృతి



చంటి (ఫైల్)

ఇచ్ఛాపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పొట్టకూటి అబుదాబి వెళ్లిన డొంకూరు గ్రామానికి చెందిన వలస కూలి ప్రాణాలు కోల్పోయాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. డొంకూరు గ్రామానికి చెందిన రామమూర్తి భాగ్యలక్ష్మిలకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారుడు చంటి ఏడాదిన్నర కిందట అబుదాబి వెళ్లి వెల్డర్ వద్ద హెల్పర్‌గా పనిలో చేరాడు. అక్కడ స్నేహితులతో సరదాగా ఉండి పనిచేసుకొనే వాడని కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే మంగళవారం చంటి (22) ఆత్మహత్య చేసుకున్నాడంటూ కంపెనీ ఎండీ కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. రెండు రోజుల కిందటే ఫోన్‌లో మాట్లాడిన కొడుకు లేకుండా పోయాడా అంటూ ఒక్కసారిగా తల్లిదండ్రులు కుప్పకూలిపోయారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుమారుడు ఆత్మహత్య చేసుకొనేంత పిరికివాడు కాడని ఏమైందో ఏమో గాని అనుమానాస్పదంగా మృతి చెందాడని వారు అభిప్రాయపడుతున్నారు. కుమారుడు మృతదేహాన్ని స్వదేశానికి తెప్పించే ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అశోక్‌ను కోరారు.

విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం

● ఎమ్మెల్యే బెందాళం అశోక్

ఇచ్ఛాపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, ఇందులో భాగంగానే మెగా డీఎస్సీ ద్వారా వేలాది మంది ఉపాధ్యాయుల నియామకం చేపట్టిందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. స్థానికంగా ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో ఉపాధ్యాయ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో ఉపాధ్యాయుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని, ప్రతీ విద్యార్థినీ ఉత్తములుగా తీర్చిదిద్దే బాధ్యతలను ఉపాధ్యాయులు తీసుకోవాలన్నారు. ఎంఈవోలు అప్పారావు, విశ్వనాథం మాట్లాడుతూ.. ఇచ్ఛాపురం మండలం, మున్సిపల్ పాఠశాలలకు ఎక్కువ ఉపాధ్యాయులను తీసుకురావడంలో ఎమ్మెల్యే అశోక్ విశేషంగా కృషి చేశారన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఉపాధ్యాయ సంఘాల నేతలు శాలువ కప్పి, బొకేలిచ్చి సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు తవిటయ్య, కోటి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ కొండా శంకర్‌రెడ్డి, పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే అశోక్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కవిటి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పోటీలకు మాణిక్యపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్ఎం ఎం.వైకుంఠరావు తెలిపారు. అండర్-17 బేస్‌బాల్ బాలురు, బాలికల పోటీలకు జయశ్రీ దొళాయి, జీతా నాయక్, కాళిదాసు సాహు, పి.వాసుదేవ్, వై.కార్తీక్, కరిష్మా కుమారి సాహు ఎంపికయ్యారన్నారు. వీరంతా ఈనెల 27 నుంచి 29 వరకు నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో జరుగు పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా మంగళవార పాఠశాలలో విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

స్విమ్మింగ్ పోటీలకు..

ఇచ్ఛాపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు స్థానిక స్వర్ణభారతి పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 29, 30 తేదీల్లో విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్-14 విభాగంలో కౌశిక్, మధుమోహన్, యోగేష్, అండర్- 17 విభాగంలో సంతోష్ పాల్గొంటారన్నారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో విద్యార్థులను విద్యా సంస్థల చైర్మన్ చాట్ల తులసీదాస్ రెడ్డి ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

తెలుగు పరీక్షలో ఆదర్శ పాఠశాల విద్యార్థి ప్రతిభ

జి.సిగడాం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మన సంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 7న స్థానిక ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి తెలుగు ప్రతిభ పరీక్షల్లో ఇదే పాఠశాలకు చెందిన విద్యార్థి డీవీ సుబ్బారావు ద్వితీయ స్థానం పొందాడని ప్రిన్సిపాల్ డి.గణేష్ పట్నాయక్ తెలిపారు. ఆరో తరగతి చదువుతున్న సుబ్బారావుకు డిసెంబరు 14న తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో జరుగు కార్యక్రమంలో బహుమతిని అందజేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ గణేష్ పట్నాయక్



ఆలయ నిర్మాణానికి అంకురార్పణ

కవిటి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): బొరివంక పంచాయతీ బొగిడియాపుట్టుగలో శ్రీనిమ్మాశుని అమ్మవారి ఆలయ నిర్మాణానికి మంగళవారం శ్రీకారం చుట్టారు. గ్రామస్థులంతా సముద్ర జలాన్ని తీసుకొని వచ్చారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

కలశాలతో మహిళల ఊరేగింపు

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

గుజరాతీపేట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మహిళలు యువ పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ప్రాజెక్టు ఇన్‌చార్జి అరుణ్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ, చిన్న, మధ్య పారిశ్రామిక విభాగం..వరల్డ్ బ్యాంకు సహాయంతో క్రెడిట్ ద్వారా పారిశామిక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. యువతులు చదువుతోపాటు పారిశ్రామిక, వ్యాపారరంగాల్లో విజయవంతంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. సూర్యచంద్రరావు, కామర్స్ హెచ్‌వోడీ కృష్ణారావు, పలువురు అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

28న మునిసిపల్ సమావేశం

ఇచ్ఛాపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ సాధారణ సమావేశం కౌన్సిల్ హాల్‌లో ఈనెల 28న నిర్వహిస్తున్నామని చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు, వివిధ విభాగాల అధికారులు హాజరు కావాలని కోరారు.

నేడు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం

జి.సిగడాం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సంతవురిటిలో వేంచేసి ఉన్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే కల్యాణ్ మురుగన్ స్వామి కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. అభిషేకాలు, తిరువీధి, తెప్పోత్సవం, నారాయణ సేవల్లో భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఏపీయూఎస్ కార్యవర్గం ఎన్నిక

కవిటి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం కవిటి మండల శాఖ కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎ.నాగేశ్వరరావు, అధ్యక్షుడిగా భగవాన్ బెహరా, ప్రధాన కార్యదర్శిగా డి.శరత్‌బాబు, ఉపాధ్యక్షులుగా గిరిధర్ ప్రదాన్, తులసి ప్రదాన్, ఆర్థిక కార్యదర్శిగా బి.కోటేశ్వరరావు, కార్యదర్శులుగా ఐ.పాపారావు, బి.వంశీకృష్ణ, సయ్యద్ హాజీలను ఎన్నుకున్నట్లు ఆ సంఘ ప్రతినిధులు తెలిపారు.

రాజ్యాంగ విలువల కోసం ఉద్యమం

శ్రీకాకుళం లీగల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సమాజంలో రాజ్యాంగ విలువల కోసం కలిసి ఉద్యమించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉంగటి వెంకటరమణ, కుమిలి రాజేష్ అన్నారు. మంగళవారం శ్రీకాకుళంలోని ఐక్యవేదిక జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. దేశం అంతటా నవంబరు 26న రాజ్యాంగ అమలు దినోత్సవాన్ని జరుపుతున్నారన్నారు. సమావేశంలో మందపల్లి రామకృష్ణ, కోంద్రు అప్పలరాజు రవికుమార్, బరాటం రమణమూర్తి, కె.కొండలరావు, కె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్బంధాలు అన్యాయం

అరసవల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పోలీసులను ఉపయోగించి ఉద్యమకారులను గృహ నిర్బంధం చేయడం అన్యాయమని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.యుగంధర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొన్న శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెన్నెలవలసలో థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి వ్యతిరేకంగా పోరాట కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం తలపెట్టిన నిరసనని అక్రమ అరెస్టులతో అడ్డుకోవడం తగదన్నారు. రాజ్యాంగ చట్టాలను అమలు పరచాలని, ఆ ప్రాంతంలో ఉన్న గిరిజన, దళిత గ్రామాల్లో అభిప్రాయ సేకరణ చేసి ముందుకు వెళ్లాలని కోరారు.

అస్వస్థతకు గురై గర్భిణి మృతి


ధనలక్ష్మి(ఫైల్)

కంచిలి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అర్జునాపురం గ్రామానికి చెందిన కాయ ధనలక్ష్మి (26) అనే గర్భిణి తీవ్ర అస్వస్థతకు గురై సోమవారం రాత్రి మృతి చెందింది. ఈ మేరకు కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ధనలక్ష్మికి ఏడాది కిందట ఇచ్ఛాపురం మండలం మండపల్లికి చెందిన కాయ శివతో వివాహమైంది. ప్రస్తుతం ఆమె ఎనిమిది నెలల గర్భిణి. కాగా కన్నవారింట్లో ప్రస్తుతం తల్లిదండ్రులతో ఉంటోంది. సోమవారం రాత్రి భోజనం చేస్తుండగా ఆమె అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు వెంటనే సోంపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో మరో రెండు ఆసుపత్రులకు వెళ్లి అక్కడి నుంచి సుమారు రాత్రి 11 గంటల ప్రాంతంలో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అప్పటికే ధనలక్ష్మి మృతి చెందినట్లు వైద్యుడు మూల జోగినాయుడు తెలిపారు. ఈ ఘటనపై సోంపేట ఎస్ఐ లవరాజు (ఇన్‌చార్జి ఎస్ఐ) కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కాటమ్మతల్లి ఆలయంలో చోరీకి యత్నం

పలాసరూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తర్లాకోట గ్రామ సమీపంలో ఉన్న కాటమ్మ ఆలయంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. ఆలయ ప్రధాన ద్వారం తాళాలను పగులగొట్టి తలుపులు తీసేందుకు దుండగలు ప్రయత్నించారు. స్టోర్ రూమ్‌ను కూడా తెరిచేందుకు యత్నించారు. గతంలో కూడా ఒకసారి దొంగలు చోరీకి యత్నించి విఫలయ్యారు. కాశీబుగ్గ పోలీసులు ఆలయం వద్దకు చేరుకొని స్థానికులు, అర్చకుల నుంచి వివరాలను సేకరించారు. హిందూ సంఘ సభ్యులు ఆలయాన్ని పరిశీలించారు. చోరీకి యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

జలుమూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) అక్కురాడ గ్రామంలో భూవివాదంపై జరిగిన కొట్లాటలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.అశోక్‌బాబు తెలిపారు. భూతగాదాలో అప్పలస్వామి, రామేశ్వరరావు దాడి చేసి గాయపర్చారని చింతాడ బాలకృష్ణ ఫిర్యాదు చేయగా, చింతాడ త్రినాథరావు, బాలకృష్ణ, అప్పమ్మ దాడిచేసి గాయపర్చారని అప్పలస్వామి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఇరువర్గాలపైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

స్ర్కాప్ దుకాణంలో అగ్నిప్రమాదం

టెక్కలి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): టెక్కలి కచేరివీధి రోడ్డులో ఉన్న స్ర్కాప్ దుకాణంలో మంగళవారం అగ్ని ప్రమాదం జరిగింది. దుకాణంలోని చెత్త నిల్వల నుంచి మంటలు రావడంతో స్థానికులు అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. రూ.ఐదు వేల నుంచి ఎనిమిది వేల వరకు నష్టం జరిగి ఉండవచ్చునని అంచనా వేశారు.

ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు రాకూడదు

● కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన జేసీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


ధాన్యం కొనుగోలు కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న జేసీ

నరసన్నపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తూ జిల్లాలో ధాన్యం సేకరణను పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'ధాన్యం కొనుగోలులో దళారీల దందా' అనే శీర్షికతో వెలువడిన కథనంపై ఆయన స్పందించారు. నరసన్నపేట మండలంలోని బొరిగివలస, సత్యవరం గ్రామాల్లో 'రైతన్నా..మీకోసం' కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. అనంతరం నరసన్నపేటలోని రైతు సేవా కేంద్రం-2లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఆర్ఎస్‌కే ద్వారా కొనుగోలు తీరును పరిశీలించారు. ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు లేకుండా అత్యంత పారదర్శకతతో కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా రైతులకు షెడ్యూల్, ట్రక్‌షీట్లు ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏవో సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్‌లో భాగస్వామ్యం కావాలి

● ఎమ్మెల్యేలు ఈశ్వరరావు, గోవిందరావు


ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యేలు ఈశ్వరరావు, గోవిందరావు తదితరులు

పాతపట్నం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ నిర్మాణంలో యువత భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యేలు నడుకుదిటి ఈశ్వరరావు, మామిడి గోవిందరావు పిలుపునిచ్చారు. మేరా యువభారత్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పాతపట్నంలో జాతీయ సమైక్యతా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. నీలమణి దుర్గ ఆలయం నుంచి పాతపట్నం కేఎస్ఎం ప్లాజా కూడలివరకూ ర్యాలీ సాగింది. దారిపొడవునా ఉన్న జాతీయనాయకులు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరంక ఏఎస్ఎం ప్లాజాలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యేలు మాట్లాడారు. నేటి యువత ధనార్జనే లక్ష్యంగా విదేశాలకు వెళ్లకుండా, స్వదేశానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మేరా యువభారత్ డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్‌ఉజ్వల్, గణంకాధికారి డి.శ్రీనివాసరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు, అంబేడ్కర్ యూనివర్సిటీ ఎన్‌ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ దంతులూరి వనజ, సీఐ ఎన్.సన్యాసినాయుడు ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ కె.చక్రపతి, ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డ్‌గ్రహీత ఆర్.లీలాప్రసాద్, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

మెళియాపుట్టి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో అక్రమాలకు పాల్పడిన అధికారులపై విజిలెన్స్ అధికారులు పారదర్శకంగా విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర గిరిజన సంఘం కార్యనిర్వహణ కార్యదర్శి బైరిశింగి దినకర్‌రావు కోరారు. గిరిజనుల అభివృద్ధికి కేటాయిస్తున్న నిధులను కొందరు అధికారులు పక్కదోవపట్టిస్తున్నారని తెలిపారు. ఐటీడీఏలో ఏళ్లుగా నాటుకుపోయిన వారిని బదిలీ చేయాలని కోరారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కొత్తూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ వెంకటేష్ అన్నారు. మంగళవారం కొత్తూరు వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రగ్స్‌తో జరిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను సాధించేందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్లాలని సూచించారు.

రైతే దేశానికి వెన్నెముక

● వారికి అండగా ఉంటాం
● లాభసాటి వ్యవసాయం చేయాలి
● 'రైతన్నా మీకోసం'లో ఎమ్మెల్యేలు, అధికారులు

రైతే దేశానికి వెన్నెముకని ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, గౌతు శిరీష, మామిడి గోవిందరావు అన్నారు. వివిధ గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో వారితో పాటు అధికారులు పాల్గొని మాట్లాడారు. రైతులు లాభసాటి వ్యవసాయం చేయాలని, రసాయన ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులు వినియోగించాలని సూచించారు. ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని తెలిపారు.

అన్నదాతల శ్రేయస్సు కోసం: బగ్గు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

జలుమూరు (సారవకోట), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతుల శ్రేయస్సు కోసం అన్ని విధాల శ్రమిస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బుడితి, లక్ష్మీపురంలో మంగళవారం నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతుల కోసం అమలు చేస్తున్న రాయితీలు, సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గం సమన్వయకర్త బగ్గు అర్చన, పార్టీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, సారవకోట సొసైటీ అధ్యక్షుడు సురవరపు తిరుపతిరావు, జలుమూరు మార్కెట్ కమిటీ అధ్యక్షుడు తర్ర బలరాం, క్లస్టర్ ఇన్‌చార్జి పట్టు ఉమామహేశ్వరరావు, సర్పంచ్ పొదిలాపు కృష్ణ, టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రైతులకు అగ్ర తాంబూలం: శిరీష


హరిపురం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

పలాసరూరల్/హరిపురం/వజ్రపుకొత్తూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతులకు అగ్రతాంబులం వేస్తోందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని గురుదాసుపురం, అంబుగాం, చిన్న డోకులపాడు గ్రామాల్లో మంగళవారం రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు ఆధునిక వ్యవసాయం, మెలకువలు నేర్చుకోవాలని, లాభసాటి వ్యవసాయం చేయాలని సూచించారు. అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే శివారు ప్రాంతాలకు వంశధార నీరు అందించామని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 24గంటల్లోనే డబ్బులు వేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్రటీడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, మూడు మండలాల టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రైతు అభ్యున్నతే ధ్యేయం:ఎంజీఆర్


సింగుపురంలో కరపత్రాల పంపిణీ

పాతపట్నం/రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రైతు అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. సింగుపురం, లాబర గ్రామాల్లో జరిగిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు అధిక ప్రాధాన్యతనిస్తూ అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. పంటకు మద్దతు ధర కల్పించడంతో పాటు అగ్రిటెక్ సేవలందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం స్థానిక ప్రజలు అందించిన వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

లాభసాటి పంటలపై అవగాహన:జేసీ


అధికారులతో మాట్లాడుతున్న జేసీ

నరసన్నపేట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతులకు లాభసాటి పంటల సాగుపై వ్యవసాయశాఖ, ఉద్యానవన శాఖ అధికారులు సంయుక్తంగా అవగాహన కల్పించాలని జేసీ ఫర్మాన్‌అహ్మద్ ఖాన్ సూచించారు. మంగళవారం బొరిగివలస, సత్యవరం గ్రామాల్లో నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను రైతులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పొందరకురాకుల కార్పొరేషన్ చైర్మన్ డి.నర్సింహులు, తహసీల్దార్ సత్యనారాయణ, ఏవో సూర్యకుమారి, తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి: ఆర్డీవో

లావేరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో కె.సాయిప్రత్యూష అన్నారు. బుధవారం గురుగుబిల్లిలో రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

తుఫాన్ రేషన్ పంపిణీలో జాప్యమేల?

● ఎఫ్‌డీవోను నిలదీసిన సభ్యులు


మత్స్యశాఖ ఎఫ్‌డీవోను నిలదీస్తున్న సభ్యులు

సంతబొమ్మాళి,నవంబరు25 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ సమయంలో మత్స్యకారులకు ప్రభుత్వం మంజూరు చేసిన రేషన్ పంపిణీలో జాప్యంపై టెక్కలి మత్స్యశాఖ ఎఫ్‌డీవో ధర్మరాజు పాత్రోను సభ్యులు నిలదీశారు. మంగళవారం ఎంపీపీ మేరుగు రాజేశ్వరి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. జగన్నాథపురంలో కొంతమంది మత్స్యకారు లకు రేషన్ ఇచ్చి మరికొంతమందికి ఎందుకు పంపిణీ చేయలేదని ఆ పంచాయతీ సర్పంచ్ జోగు రాములమ్మ మత్స్యశాఖ ఎఫ్‌డీవోను ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి వచ్చిన బంగాళదుంపలు, ఉల్లిపాయలను పంపిణీ చేయకపోవడంతో అవి కుళ్లిపోతు న్నాయని మేఘవరం ఎంపీటీసీ సూరాడ రాజారావు అన్నారు. అందరి మత్స్యకారులకు నిత్యావసర సరుకులు ఇవ్వాలన్న ఆలోచనతో పంపిణీ చేయలేదని ఎఫ్‌డీవో సమాధానమివ్వగా.. జిల్లాలోని అన్ని మత్స్య కార మండలాల్లో రేషన్ పంపిణీ జరిగిందని, ఇక్కడ మాత్రమే ఎందుకు కొర్రీలు వేస్తున్నారని సభ్యులు నిలదీశారు. మండల ప్రజలకు సివిల్ సప్లయిస్ డీటీ అందుబాటులో ఉండడం లేదని ఎంపీపీ రాజేశ్వరి, డీజీపురం సర్పంచ్ అశోకచక్రవర్తి సభ దృష్టికి తీసుకువచ్చారు. ఉమిలాడ అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన గుడ్లు పంపిణీ చేశారని, ఈసారి నుంచి మంచి గుడ్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లను ఎంపీపీ ఆదేశించారు. బోరుభద్రలో విద్యుత్ స్తంభాల మార్పు పనులు పూర్తి చేయాలని సర్పంచ్ బుసకల లక్ష్మీకాంతం కోరారు. ఈ సమావేశంలో తహసీల్దార్ హేమసుందరరావు, ఎంపీడీవో జయంత్ ప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ కూచెట్టి కాంతారావు, మండల విద్యాశాఖాధికారి జలుమూరు చిన్నవాడు తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారు?

● మండల సమావేశంలో అధికారులను ప్రశ్నించిన సభ్యులు


మాట్లాడుతున్న ఎంపీడీవో ఫణీంద్రకుమార్

కోటబొమ్మాళి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులకు పెండింగ్ బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారని మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అధికారులను ప్రశ్నించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.ఫణీంద్ర కుమార్ ఆధ్వర్యంలో, ఎంపీపీ రోణంకి ఉమా మల్లేశ్వరరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. గ్రామాల్లో ఇల్లు, ఇంటి స్థలం లేనివారికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని, అలాంటి వారు ఈనెల 30లోపు గ్రామీణ ఆవాస్ యోజన పథకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని గృహనిర్మాణ శాఖ అధికారులు కోరారు. దీనిపై పలువురు సభ్యులు మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వంలో చాలా మంది ఇళ్లు నిర్మించుకున్నారని, కొంతమందికి బిల్లులు పెడింగ్‌లో ఉన్నాయని, వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అవి ఆన్‌లైన్‌లో నమోదై ఉన్నాయని ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే లబ్ధిదారుల ఖాతాలో జమవుతాయని అధికారులు తెలిపారు. ఓటర్ జాబితాలో భర్తపేరు ఒక వార్డులో, భార్యపేరు మరో వార్డులో నమోదై ఉన్నాయని, వాటిని సరిచేయాలని, శ్రీపురం కూరగాయల మార్కెట్ వద్ద రైతులు కూరగాయలను నిల్వచేసుకొనేందుకు శీతల గిడ్డంగి నిర్మించాలని చీపుర్లపాడు ఎంపీటీసీ బొడ్డు అప్పన్న.. డిప్యూటీ తహసీల్దార్ ప్రసాదరావును కోరారు. ఓటర్ల జాబితాను ఇప్పటికే బీఎల్‌వోలు సరిచేస్తున్నారని, నెలలో పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ దుక్క రోజారాణి, పీఏసీఎస్ అధ్యక్షురాలు వెలమల విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై హింసను నిర్మూలించాలి

● సీనియర్ సివిల్ న్యాయాధికారి నిర్మల


మాట్లాడుతున్న సీనియర్ న్యాయాధికారి నిర్మల

టెక్కలి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళలపై జరుగుతున్న హింసను నిర్మూలించాలని సీనియర్ సివిల్‌న్యాయాధికారి బి.నిర్మల అన్నారు. మహిళలపై హింస నిర్మూలనా దినం సందర్భంగా మంగళవారం మహిళా సమైఖ్య కార్యాలయంలో స్వయంశక్తి సంఘాల మహిళలతో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళలను మానసికంగా, శారీరకంగా హింసించడం చట్టరీత్యా నేరమని, అందుకు కఠిన శిక్షలు విధించబడతాయని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పినకాన అజయ్‌కుమార్, ఏజీపీ దివ్వల వివేకానంద, సనపల జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు చట్టాలు

● జూనియర్ సివిల్ న్యాయాధికారి మాధురి


మాట్లాడుతున్న న్యాయాధికారి మాధురి

పలాస, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణకోసం అనేక చట్టాలు అమలులో ఉన్నాయని, వాటిపై అవగాహన అవసరమని పలాస జూనియర్ సివిల్ న్యాయాధికారి యు.మాధురి అన్నారు. మహిళలపై హింస నిర్మూలనా దినం సందర్భంగా మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ.. వరకట్న నిషేధ చట్టం, గృహహింస నిరోధక చట్టం, మనోవర్తి వంటి చట్టాలు ఉన్నప్పటికీ మహిళలకు వాటిపై అవగాహన లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. డిసెంబరు 13న జరిగే లోక్‌అదాలత్‌లో ఎక్కువగా పెండింగ్ కేసులను రాజీ చేసుకోవాలని కోరారు. ఏపీపీ రమేష్, సీఐ తిరుపతిరావు, ఏఎస్ఐ గోవిందరాజు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కల్పించాలి

● సివిల్ కోర్టు న్యాయాధికారి వాణి


మాట్లాడుతున్న న్యాయాధికారి వాణి

నరసన్నపేట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): చట్టాలపై మహిళలకు అవగాహన కల్పించాలని స్థానిక సివిల్ కోర్టు న్యాయాధికారి, మండల న్యాయసేవాధికారి సంస్థ చైర్‌పర్సన్ ఎస్.వాణి సూచించారు. మంగళవారం స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో మహిళా చట్టాలు- రక్షణ అనే అంశంపై అవగాహన సదస్సును నిర్వహించారు. మహిళలపై జరుగుచున్న అరాచకాలు గురించి వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ వాన శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.కొండలరావు, న్యాయవాదులు ఆర్‌కే నాయుడు, టి.మధుసూదనరావు, జి.అప్పారావు, వై.నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సంపూర్ణ భద్రత

● జూనియర్ సివిల్ న్యాయాధికారి రోషిణి

పాతపట్నం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై అవగాహనతో మహిళలకు సంపూర్ణ భద్రత ఉంటుందని పాతపట్నం జూనియర్ సివిల్ న్యాయాధికారి మానెం రోషిణి తెలిపారు. మహిళలపై హింస నిర్మూలనా దినం సందర్భంగా మంగళవారం స్థానిక కోర్టుప్రాంగణంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళా చట్టాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి మద్దిల రమణ, న్యాయవాది యు.దాలయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు బైక్ ర్యాలీ

టెక్కలి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు సమతా సైనిక్‌దళ్ జిల్లా కార్యదర్శి చల్లా రామారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9గంటలకు బాణాపురం నుంచి టెక్కలిలోని అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

6న ఏపీఎన్జీవో ఎన్నికలు

హిరమండలం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏపీఎన్జీవో హిరమండలం తాలుకా ఎన్నికలు డిసెంబరు 6న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి ఆర్.గోవిందపట్నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హిరమండలం యూనియన్‌లో 11పోస్టులకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 29న నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగే ఈ ఎన్నికల్లో ఎల్.ఎన్.పేట, హిరమండలంలోని 350మంది సభ్యులు పాల్గొనాలని కోరారు.

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

నందిగాం, నవంబరు25(ఆంధ్రజ్యోతి): బడబందలో బుధవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు జిల్లా దళిత మహాసభ అధ్యక్షుడు బోకర నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, మేధావులు, ఉద్యోగులు, అభిమానులు, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఐతమ్ రైజ్ లోగో ఆవిష్కరణ

టెక్కలి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఐతమ్ రైజ్ ఇంకుబేటర్ లోగో, వెబ్‌సైట్‌ను ఎకో సిస్టమ్ అభివృద్ధి నిపుణులు, తహబ్ మాజీ సీఈవో మహంకాళి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ప్రపంచ వ్యాప్తంగా సాంకేతిక రంగంలో జరుగుతున్న వేగవంతమైన మార్పులకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేయడం, వారిని స్టార్టప్ ప్రపంచానికి అనుసంధానం చేయడమే లక్ష్యంగా రైజ్ ఇంకుబేటర్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, కార్యదర్శి ఎల్ఎల్ నాయుడు పాల్గొన్నారు.

లింగాలవలస పాఠశాలకు సామగ్రి వితరణ

జలుమూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): లింగాలవలస ఉన్నతపాఠశాలకు ఐడీబీఐ బ్యాంకు(శ్రీకాకుళం) రూ.1.40 లక్షల విలువ చేసే సామగ్రిని వితరణగా అందించింది. లాప్‌టాప్, కుర్చీలు, టేబుళ్లు, స్టాండు ఫ్యాను, బీరువా, ప్రింటర్, సౌండు బాక్సులను మంగళవారం బ్యాంకు సిబ్బంది అందజేశారు. బ్యాంకు మేనేజర్ ప్రవీణ్ కుమార్, ఎంఈవో బమ్మిడి మాధవరావు, ఎంఈవో-2 ప్రసాదరావు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

నందిగాం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని పలాస డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి పి.విలయమ్స్ అన్నారు. మంగళవారం నౌగాం జడ్పీ ఉన్నతపాఠశాల మైదానంలో మండలస్థాయి గ్రిగ్స్ పోటీలను ఆయన ప్రారంభించారు. బాలురుకు సీనియర్, జూనియర్ విభాగాల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. బుధవారం బాలికలకు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

క్రీడలపై శ్రద్ధ ఉండాలి

టెక్కలి రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రీడలపై ప్రతి విద్యార్థికి శ్రద్ధ ఉండాలని మండల విద్యాశాఖ అధికారి తులసీరావు అన్నారు. మంగళవారం రావివలస పాఠశాలలో మండల స్థాయి గ్రిగ్స్ పోటీలను ప్రారంభించారు. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని ఆయన అన్నారు. ఎంఈవో-2 చిన్నారావు, సర్పంచ్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆటల పోటీలు

పోలాకి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఈదులవలస ఉన్నత పాఠశాల ప్రాంగణంలో రెండురోజులుగా జరుగుతున్న మండలస్థాయి గ్రిగ్స్ ఆటలపోటీలు మంగళవారం ముగిశాయి. బాలికలకు జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. విజేతలకు టీడీపీ సమన్వయకర్త బగ్గు అర్చన, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ, కూటమి నాయకులు బైరి భాస్కరరావు, ఎంవీ నాయుడు, రోణంకి కృష్ణంనాయుడు బహుమతులు అందజేశారు. ఎంఈవో ఎస్.శ్రీనివాసరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాస్, పాల్గొన్నారు.

జాతీయ టెన్నికాయిట్ పోటీలకు పలాస విద్యార్థులు

పలాస, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలకు పలాస ప్రభుత్వ ఉన్నతపాఠశాల విద్యార్థులు కొరికాన జయంత్, నెయ్యల దివ్య ఎంపికైనట్లు హెచ్ఎం పి.రవికుమార్, కోచ్ పి.తవిటయ్య తెలిపారు. ఈ నెల 21, 22 తేదీల్లో మందస మండలం సొండిపూడి పాఠశాలలో రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నాయని చెప్పారు. ఈ మేరకు మంగళవారం స్కూల్‌లో విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

టెక్కలిలోకి నందిగాం

(ఐదో పేజీ తరువాయి)

పరిధి మండలం కూడా. అయితే గతంలో వైసీపీ ప్రభుత్వం.. జిల్లాల పునర్విభజన, కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటు.. కారణాలతో పలాస రెవెన్యూ డివిజన్ పరిధిలో చేర్చింది. దీంతో పరిపాలనాపరమైన పనుల కోసం.. రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం రైతులు, సామాన్య ప్రజలు పలాస వెళ్లాల్సి వచ్చేది. ఇది దూరాభారంతో పాటు, సమయం, డబ్బు వృథా అయ్యేలా చేస్తోందన్న ఆవేదన స్థానికుల్లో ఎప్పటి నుంచో ఉంది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో నందిగాం వాసులకు ఆర్డీవో కార్యాలయం మరింత చేరువ కానుంది. టెక్కలి డివిజన్‌లోకి మారడం వల్ల ప్రభుత్వ కార్యాలయాలు అందుబాటులో ఉంటాయని, పనులు వేగవంతం అవుతాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బరంపురం టు కర్ణాటక

(ఐదో పేజీ తరువాయి)

బరంపురంలోని హిమాన్స్ శేఖర్ మాజిహి అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేసి..కర్ణాటకలోని హుబ్లీకి తరలిస్తున్నట్టు గుర్తించాం. గంజాయిని స్వాధీనం చేసుకున్నాం. అబ్దుల్‌సమద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాం. నిందితుడు 2010లో ఒక హత్యకేసులో జైలు శిక్ష అనుభవిస్తూ పెరోలు మీద బయటకు వచ్చాడు. జైలులో ఏర్పడిన పరిచయాలతో గంజాయి కొనుగోలు చేసేందుకు బరంపురం వచ్చినట్లు దర్యాప్తులో తేలిందని సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఎస్ఐ 2 శేఖరరావు, ఏఎస్ఐ అసిరినాయుడు, దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.